

### వైభవంగా తిరుమంజనం
హనుమజ్జయంతి కార్యక్రమాల్లో భాగంగా గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో గురువారం అంజన్న తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

-8లో



### బంగారు 'భవిత'కు బాటలు
ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రాలు ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇస్తోంది.

-8లో

గరిష్టం/కనిష్టం
41.6/30.8

### వాతావరణం
జిల్లాలో గురువారం 30.8 – 41.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### 1 నుంచి 7వరకు 'రెడ్యం' ఇంటికే పరిమితం



'రెడ్యం'కు నోటీసులు అందిస్తున్న పోలీసు

ఖాజీపేట: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఇంటికే పరిమితం కావాలని కడప ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. దుంపలగట్టు గ్రామంలోని రెడ్యం స్వగృహంలో నోటీసులను ఖాజీపేట పోలీసులు అందించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అధికారులు తీసుకునే నిర్ణయాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు ఇంటికే పరిమితం కావాలని, గడప దాటి బయటకు రావద్దని సూచించారు.

### పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 155 మంది హాజరు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 43001 నుంచి 59 వేల మధ్య ర్యాంకులు వచ్చిన 155 మంది విద్యార్థులు హాజరయ్యారు. తమకు సంబంధించిన ర్యాంకులతోపాటు సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకున్నారని పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు. శుక్రవారం 59001 నుంచి 75000 వరకు ర్యాంకులు పొందిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు, ర్యాంకులను పరిశీలన చేయనున్నట్లు కో- ఆర్డినేటర్ జ్యోతి తెలిపారు.

### క్రికెట్ జట్టుకు ఎంపిక



పనికెల వరుణ్

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల గిరినగర్‌కు చెందిన పనికెల వరుణ్ అండర్ 19 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఇతను చిత్తూరు జిల్లా జట్టు తరఫున ఆడుతున్నాడు. అనంతపురంలో జరిగే నాలుగు జిల్లాల (కర్నూలు, కడప, నెల్లూరు, అనంతపురం) టోర్నమెంట్‌లో పాల్గొంటాడు. ఈ టోర్నీ ఈ నెల 28 నుంచి ప్రారంభమైంది. జూన్ 3 వరకు జరుగుతుంది. శుక్రవారం అనంతపురం జట్టుతో, ఆదివారం నెల్లూరు, మంగళవారం కర్నూలు జట్లతో జరిగే మ్యాచ్‌ల్లో పాల్గొంటాడు. వరుణ్ చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. అండర్-12, అండర్-16 జట్లలో స్థానం పొంది సౌత్ జోన్ తరఫున ఆడాడు. వరుణ్‌కు తల్లిదండ్రులు నరసింహులు, ఉమతో పాటు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం



కడపలోని అంధుల ప్రభుత్వ పాఠశాల

కడప ఎడ్యుకేషన్: కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి ప్రవేశం కోసం అంధ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు హెడ్‌మాస్టర్ ఎం. శంకరయ్య గురువారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఏ ప్రాంతం నుంచైనా ఈ ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులు చేరవచ్చన్నారు. ఇందులో చేరిన వారికి ఎలాంటి ఫీజులు లేవని, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇస్తారని, మ్యూజిక్‌లో ప్రత్యేక శిక్షణ, కో ఎడ్యుకేషన్‌లో విద్యాభ్యాసం ఉంటుందని వివరించారు. బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి ఉందని తెలిపారు. పుట్టుకతో లేదా మధ్యలో అంధత్వం కలిగిన విద్యార్థులకు వారి స్థాయిని బట్టి ఆయా తరగతుల్లో చేర్చుకుని ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. దీంతోపాటు వారికి బ్రెయిలీ లిపి నేర్పిస్తామని చెప్పారు. జూన్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. ఇందులో చేరే విద్యార్థులు సదరం చేత ధ్రువీకరించిన మెడికల్ సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, మూడు ఫొటోలు జతపరిచి పంపాలన్నారు. మరింత సమాచారం కోసం 9291306870, 8328375357 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# వనితర సాధ్యులు!

'ఆమె'.. ఇంటికి దీపపై వెలుగిస్తుంది.. కంటికి రెప్పలా మారి అడవి తల్లినీ రక్షిస్తుంది.. 'ఆమె'.. పిల్లి అలికిడికి భయపడే పిరికి అబల కాదు.. పులి అడుగుల్లో నడిచే గుండె ధైర్యమున్న సబల.. అవును.. వారంతా మగువలు.. అయితేనేం.. టన్నులకొద్దీ తెగువ ఉన్నవారు.. మసకేసిన మబ్బుల్ని.. 'కాన'రాని చీకట్లను చీల్చుకుంటూ కాంతి రేఖలా మెరుస్తున్నారు. మాటేసిన ప్రమాదాలకు.. కాటేసే వేటగాళ్లకు ఎదురెళ్లడానికి అస్సలు వెనకడుగు వేయరు. ప్రకృతికి ప్రణమిల్లి అడుగు ముందుకేశారు.. ఇంటి గడప దాటొచ్చి అడవి తల్లి ఒడిలోని కలపకు కాపలా కాస్తున్నారు.. నిలువెల్ల కన్నులతో పహారా కాస్తూ.. 'వనిత'ర సాధ్యులమని నిరూపిస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు నాగమణీశ్వరి. ఈమె జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలను నిర్వర్తిసున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం పరిరక్షణలో భాగంగా దట్టమైన అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈమె ఒక్కరేనా అంటే కాదు ఏబీఓ, ఎఫ్‌బీవో తదితర హోదాల్లో పదుల సంఖ్యలో మహిళా మణులు విధులు నిర్వరిస్తున్నారు. అడవి తల్లి సేవలో తరిస్తూ 'వనిత'ర సాధ్యులుగా నిలుస్తున్నారు.





శేషాచలం అడవిలో విధులు నిర్వహించేందుకు వెళుతున్న అటవీశాఖ మహిళా సిబ్బంది

- అటవీశాఖలో మగువుల తెగువ
- వివిధ బాధ్యతల్లో తమదైన ముద్ర
- వన్యప్రాణుల, అడవుల సంక్షణలో 'ఆమె' కీలకం
- సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటూ ముందడుగు

రాజంపేట: కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి నిలయమైన తిరుమల క్షేత్రంగా విస్తరించబడిన శేషాచలం అటవీ ప్రాంతం జిల్లాలో కూడా విస్తరించి ఉంది. జిల్లాలో రాజంపేట, చిట్వేలి, బాలపల్లె, రైల్వేకోడూరు, సానిపాయి, మదనపల్లె, పీలేరు రేంజ్‌లలో మహిళలు వివిధ స్థాయిలో శాఖపరంగా పురుషులతో సమానంగా సేవలందిస్తున్నారు. అరుదైన జంతుజాలం, వృక్షజాలంతో నిలయమై.. చిరుత పులులు, ఎలుగుబంట్లు వంటి క్రూరమృగాలయాలతో పాటు శేషాచలం (బయోస్పెయిర్)ప్రాంతంలో ఉద్యోగం అంటే ఎవరైనా భయపడాల్సిన పరిస్థితి. అటువంటి కారడవుల్లో మహిళలు ఆత్మస్థైర్యాన్ని కూడగట్టుకొని ముందుకు సాగుతున్నారు. వనితర సాధ్యులమని నిరూపిస్తున్నారు. అడవులు, వన్యప్రాణుల పరిరక్షణలో తమదైన ముద్రవేసుకుంటున్నారు. బిడ్డలను తల్లి కంటికి రెప్పలా రక్షించుకున్నట్లుగా వనాలను సంక్షరిస్తున్నారు.

**జిల్లా అటవీశాఖ నైసర్గిక స్వరూపం ఇలా..**
జిల్లాలో ఎనిమిదిరేంజ్‌లు ఉన్నాయి. శేషాచలం, పెనుశిల అభయారణ్యాలలో దట్టమైన అటవీ ప్రాంతాలున్నాయి. శేషాచలం1.23 లక్షలహెక్టార్లు, పెనుశిల అభయారణ్యం23వేల హెక్టార్లు విస్తరించబడివుంది. వన్యప్రాణులు ఉన్న ప్రాంతం3.1 మిలియన్ల హెకార్లు విస్తరించి ఉంది.

**అటవీశాఖ: అన్నమయ్య జిల్లా**

రేంజ్: 8
శేషాచలం: 1.23 లక్షల హెక్టార్లు
పెనుశిల అభయారణ్యం: 23 వేల హెక్టార్లు
వన్యప్రాణులు ఉన్న ప్రాంతం: 3.1 మిలియన్ల హెక్టార్లు



శేషాచలం

**సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటూ..**
జిల్లా అటవీశాఖ పరిధిలో.. అదీ శేషాచలం అటవీ ప్రాంతంలో మహిళలు ఉద్యోగం చేయడం కత్తిమీద సాములాంటిదే. కానీ విధి నిర్వహణలో తమకు ఎదురైన సవాళ్లను సైతం దీటుగా ఎదుర్కొంటు ముందుకు వెళుతున్నారు. అటవీభూములు పరిరక్షణలో సింహాలై గర్జిస్తున్నారు. పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మారిన కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళలు, కష్టసాధ్యమైన ఈ పనిలో ధైర్యంగా అడుగేస్తున్నారు. శేషాచల, లంకఅభయారణ్యాలులో వివిధ రేంజల పరిధిలో వివిధ హోదాలలో తమ సేవలను అందిస్తున్నారు. శేషాచలం, పెనుశిల అభయారణ్యం, హార్సిలీహిల్స్, రాయచోటి తదితర అటవీ ప్రాంతాల్లో మహిళలు తమ విధులను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎఫ్‌బీవో, ఎస్ఎస్‌వో, ఎఫ్‌డీఆర్వో, ఎఫ్ఆర్వో తదితర ఉద్యోగాలలో 22 మంది మహిళలు జిల్లా అటవీశాఖ పరిధిలో తమ విధులను నిర్వరిస్తున్నారు.

**పురుషులతో సమానంగా విధులు**



అటవీశాఖలో పురుషులతో పాటు సమానంగా విధులు చేయాల్సి ఉంటుంది. పురుష ఉద్యోగులతో సమానంగా రాత్రిళ్లు పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో అడవిలోకి ఒంటరిగా కూడా వెళ్లాల్సి ఉంటుంది. అటవీశాఖలో పనిచేయడం అదృష్టమే.

-సుబ్బలక్ష్మి, రైల్వేకోడూరు రేంజ్

**వన్యప్రాణులపై మమకారం**



వన్యప్రాణులు, చెట్లపై మమకారంతో అటవీశాఖలో చేరాను. ఎఫ్‌బీవోగా పనిచేస్తున్నారు. టీ.సుండుపల్లె బీట్‌లో విధులు నిర్వరిస్తున్నాను. కంటికిరెప్పలా అడవిని సంరక్షించుకుంటున్నాం. అటవీ గ్రామాల ప్రజలు మంచివారు. వారితో కలిసి సఖ్యతగా ఉంటూ, అటవీసంరక్షణలో వారి సహకారం తీసుకుంటున్నాం.

-బీ.లక్ష్మీప్రసన్న, ఎఫ్‌బీవో, సుండుపల్లె బీట్

**కష్టమైనా ఇష్టంగానే..**



మదనపల్లె రేంజ్‌లో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాను. అటవీ సంరక్షణపై మక్కువతో విధులు బాధ్యతయుతంగా నిర్వర్తిస్తున్నాను. అటవీసంరక్షణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులలో తాను ముందుకెళుతుంటాను. విధి నిర్వహణలో ఒక్కోసారి కష్టంగా ఉంటుంది. అయినా ఇష్టంగానే విధులు నిర్వరిస్తుంటాను.

-దీప, ఎఫ్‌బీవో, తవలంబీట్, మదనపల్లె రేంజ్

**ఎంతో ధైర్యం వచ్చింది**



వాల్మీకిపురం, హార్సిలీహిల్స్, పుంగునూరు అటవీప్రాంతాల్లో పనిచేయడంతో ఎంతో ధైర్యం వచ్చింది. అర్ధరాత్రైనా అవలీలగా ఎక్కడికైనా వెళ్లి ధైర్యంగా విధులు పూర్తి చేసుకుంటున్నాం. అటవీ ప్రాంతాలలో ఒక్కొక్కసారి సెల్‌ఫోన్లు సిగ్నల్స్ కూడా సక్రమంగా అందవు. ఇంటికి సమాచారం కూడా చెప్పలేని పరిస్థితులు. చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తుంటాయి. ప్రాణాలను ఫణంగా పెట్టి చిత్తశుద్ధితో విధులు నిర్వరిస్తున్నాం.

-సీ.శోభారాణి, ఎఫ్‌బీఓ, మదనపల్లె రేంజ్

**ఎర్రచందనాన్ని పరిరక్షించాను**



వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నేను అటవీశాఖలో 2010లో ఏబీవోగా చేరాను. కోడూరు, చిట్వేలి, రాజంపేట రేంజ్‌లలో పని చేశాను. ప్రస్తుతం ఎఫ్‌బీవోగా సానిపాయి రేంజ్‌లో ముడుంపాడులో పనిచేస్తున్నాను. ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టే విధులలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధులు నిర్వహించాను. అటవీశాఖలో పనిచేసే అవకాశం కలగడం మహాభాగ్యం.

-ఏ.అంజనాస్వాతి, ఎఫ్‌బీవో, సానిపాయిరేంజ్, సుండుపల్లె

### స్ట్రాంగ్ రూములను పరిశీలించిన డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఈవీఎంలను భద్రపరిచిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూములను ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌బి అంజద్‌బాషా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో ఏవైనా లోపాలు ఉన్నాయా..అని ఆయన తనిఖీ చేశారు. డిప్యూటీ సీఎం వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, రహీం ఉన్నారు.



స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వెళ్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

### వెబ్‌సైట్‌లో పదోన్నతుల జాబితా

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని కడప మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలు, ప్రొద్దుటూరు మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండిట్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించిన టెన్టేటివ్ కామన్ సీనియారిటి జాబితా కడపడీఈఓ.ఇన్ వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ విషయాన్ని డీఈఓ మర్రెడ్డి అనురాధ గురువారం తెలిపారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే జూన్ 4వ తేదీ సాయంత్రంలోపు సంబంధిత ఎంఈఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

# క్షణక్షణం.. అప్రమత్తం



పోలీసు బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు (ఫైల్)




స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పరిశీలన (ఫైల్)

- జిల్లాలో నిరంతరం పోలీసుల నిఘా
- జూన్ 4న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భద్రత పెంపు

కడప అర్బన్: ఓట్ల లెక్కింపు సమయం సమీపించే కొద్దీ ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ సమయంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసునిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటికే 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గంలో అమలులో ఉంది. ఈ సెక్షన్ల అమలు జూన్ 6 వరకు కొనసాగనుంది. ఎన్నికల ఫలితాల ముందు, తరువాత గ్రామాలు, పట్టణాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయనాయకుల సందేశాలు, ప్రసంగాలు, నిరాధార ఆరోపణలు, రచ్చబండ చర్చలు, సోషల్ మీడియాలో ప్రచారం మొదలైన వాటిని నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు.

- పెట్రోల్ బంకుల్లో బాటిళ్లకు, క్యాన్‌లకు డీజిల్, పెట్రోల్ విక్రయించరాదని అధికారులు సూచించారు. బాణసంచా విక్రయాలపై ఆంక్షలు విధించారు. అసాంఘిక కార్యకలాపాలైన గ్యాంబ్లింగ్, కోడిపందేలు, క్రికెట్ బెట్టింగ్ మొదలైన చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా, మద్యం అక్రమ రవాణా, కొనుగోలు జరుగకుండా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

**జిల్లాలో ఇప్పటికే 18620 మంది బైండోవర్...**
జిల్లా వ్యాప్తంగా సీఐ, ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకులు, వివిధ వర్గాల ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కౌంటింగ్ సమయంలో కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠినచర్యలు ఏస్థాయిలో ఉంటాయో ప్రజలకు పోలీసు అధికారులు వివరిస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే పోలీస్ పికెట్, పెట్రోలింగ్, ఔట్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 3801 కేసులను నమోదు చేసి 18620 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో ఎన్నికలు జరిగినప్పటి నుంచి 40 మందిపై కేసులను నమోదు చేయడంతో పాటు రౌడీషీట్‌లను తెరిచారు. ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా అల్లర్లకు, ఘర్షణలకు పాల్పడితే వారిని జిల్లా నుంచి బహిష్కరణ చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- కడప నగరంలో జూన్ 3వ తేదీ నుంచే లాడ్జీలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో ఎవరూ బసచేయరాదని, కౌంటింగ్ రోజున వాటిని పూర్తిగా మూసివేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ఇప్పటికే ఆయా సంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులతో సమీక్షను నిర్వహించి హెచ్చరికలు జారీ చేశారు.

**స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టంగా భద్రత**
స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టంగా భద్రతాచర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. 24 గంటలూ సీసీ కెమెరాల నిఘా, సాయుధ బలగాల గస్తీ ఏర్పాట్లు చేశారు.

- కడప నగర శివార్లలోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అర్ధరాత్రి సమయంలో కూడా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. కౌంటింగ్ రోజున ఎలా ఉండాలో పోలీసుల అధికారులు, సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు.

### కౌంటింగ్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు: ఎస్పీ

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్పీ గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే దారుల వెంట సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని, ప్రతి వ్యక్తి కదలికలు, సీసీ కెమెరాలు రికార్డు చేస్తాయన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని సూచించారు.

- కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్‌లు తీసుకెళితే సీజ్ చేస్తామని, మళ్లీ ఇచ్చేది లేదని ఎస్పీ వివరించారు. జూన్ 4 నుంచి కర్ఫ్యూ అమలు చేస్తామని, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని జిల్లా ఎస్పీ తెలిపారు.
- జూన్ 6 వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటాయన్నారు. ఎవరైనా బయటి వ్యక్తులకు, గుర్తు తెలియని వ్యక్తులకు, పాత నేరస్తులకు ఆశ్రయమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.
- జూన్ 6 వరకు నిబంధనలు అమలులో వుంటాయని, ప్రజలు పోలీస్‌శాఖకు సహకరించాలనీ జిల్లా ఎస్పీ తెలిపారు.

# వైభవం.. పుష్పయాగం



స్వామి వారికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

**ముగిసిన నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు**

జమ్మలమడుగు: నారాపురస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పుష్పయాగం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన వివిధ రకాల పూలతో శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారికి అర్చకులు పూలతో అభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం ప్రత్యేక హోమం జరిపారు. భక్తులు వివిధ రకాల పూలను స్వామివారికి సమర్పించారు. ఈనెల 20 వతేదీ ప్రారంభమైన నారాపురస్వామి బ్రహ్మోత్సవాలకు పుష్పయాగంతో ముగింపు పలికారు.

## ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియల్ ప్రథమ, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిశాయని ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లావ్యాప్తంగా 37 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 17,688 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 5336 మంది ఇంప్రూవ్‌మెంట్, 6011 మంది నాన్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాయగా ఒకేషనల్ ఇంప్రూవ్‌మెంట్‌కు 113 మంది, నాన్ ఒకేషనల్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు 583 మంది రాశారన్నారు.ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 5114 మంది జనరల్, 531 ఒకేషనల్ పరీక్షలు రాశారని చెప్పారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన జిల్లా అధికారులందరికి ఆయన కృతజ్ఞతలను తెలియచేశారు.

**చివరిరోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతం**
జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్ , పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో 37 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 5624 మంది విద్యార్థులకు 5273 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు 227 మందికి 177 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 22 పరీక్ష కేంద్రాల్లో జనరల్‌కు సంబంధించి 1401 మందికి 1303 మంది, ఒకేషనల్‌కు సంబంధించి 82 మందికి 66 మంది హాజరయ్యారు.

### 1549 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 16 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన జీవశాస్త్ర పరీక్షకు 2347 మంది విద్యార్థులకు 1549 మంది హాజరుకాగా 798 మంది గైర్హాజరయారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 6 కేంద్రాలను తనిఖీ చేశాయి.

## పాడుబడ్డ మిల్లులో పాడుపని



అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మిల్లు

రైల్వేకోడూరు : మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని ప్రధాన రహదారి ప్రక్క ముగ్గురాళ్ల మిల్లులో అసాంఘిక కార్యక్రలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. నిత్యం కొందరు బైక్‌లు, ఆటోల్లో యువతులను తీసుకువస్తున్నారని, ఆ మార్గంలో తిరగలేక ఇబ్బంది పడుతున్నామని కొందరు తెలిపారు. పోలీసులు స్పందించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.



# దళారీకి కమీషన్.. రైతన్న పరేషాన్

- జాక్‌పాట్ పేరుతో టమాట రైతులకు దగా
- వందకు 20 క్రేట్లు, పదిశాతం కమీషన్ వసూలు
- రోజూ సుమారుగా రూ.4.80 లక్షల దోపిడీ

టమాటా మార్కెట్లలో రైతులను నిలువునా దగా చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలవుతోంది. జాక్ పాట్ పేరుతో వ్యాపారులు కుమ్మక్కై అన్నదాతను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతు తెచ్చిన వంద క్రేట్ల టమాటాకుగానూ, 20 క్రేట్ల వరకు దోచేయడమేగాక, పది శాతం కమీషన్ దండుకుంటున్నారు. ప్రతి రోజూ ఈ లెక్కన రూ.4.80 లక్షల వరకు దళారుల పాలవుతోంది. రైతన్న లబోదిబోమంటున్నాడు.



మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ రద్దు అని బోర్డులు పెట్టిన దృశ్యం



వేలంపాట సమయంలో క్రేట్లపై పోసిన టమాటాలు

గుర్రంకొండ: పడమటి మండలాల్లో మదనపల్లె తర్వాత గుర్రంకొండ మార్కెట్ అది పెద్దది. ఇక్కడ వ్యాపారులు, దళారీలు పాడిందే పాట. మార్కెట్ యార్డులో ప్రభుత్వ నిబంధనలు అమలు కాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే వారిపై వేధింపులకు దిగుతున్నారు. నిత్యం 40 నుంచి 50 లారీల టమాటాలు మార్కెట్‌కు తరలిస్తారు. సుమారు 30 వుండీలు నిర్వహిస్తారు. దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తారు. అయితే స్థానిక వ్యాపారులు జాక్‌పాట్ పేరుతో రైతులను దగా చేస్తున్నారు. జాక్ పాట్ ఉండకూడదనే ప్రభుత్వ నిబంధనకు పాతరవేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి వంద క్రేట్లకు 20 క్రేట్లు వదలాలని ఒత్తిడి చేస్తున్నారు. అంతేగాక వేలంపాటకు సిద్ధంగా ఉంచిన క్రేట్లపై మరో పది క్రేట్లు ఎత్తుగా పోస్తున్నారు. మళ్లీ వేలంపాటల సమయంలో వందకు పది క్రేట్ల వరకు తీసుకుంటున్నారు. ఈ లెక్కన వందకు 20 క్రేట్లు దోచుకొంటున్నారు.

### పదిశాతం కమీషన్ వసూలు

జాక్‌పాట్‌ల దోపిడీ ఒకవైపు అయితే.. మరో వైపు బిల్లు వేసేటప్పుడు పది శాతం కమీషన్ తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు శాతం కమీషన్ వసూలు చేయాల్సి ఉంది. ప్రతి మండీ వద్ద ఇప్పటికీ నాలుగు శాతం మాత్రమే కమీషన్ అనే బోర్డులు ఉన్నాయి. అయితే అవి పేరుకే గానీ, నిబంధనలు అమలు కాలేదు. టమాటా దిగుబడులను తీసుకొచ్చే రైతుల వద్ద 10 శాతం కమీషన్‌తోపాటు క్రేట్ కూలీ రూ.2, క్రేట్ బాడుగ రూ.2 వసూలు చేస్తున్నారు. దీంతో దిగుబడి మార్కెట్ యార్డుకు చేరేసరికి కోత కూలీ, రవాణా ఖర్చులు, వుండీల ఖర్చులు కలిపి క్రేట్‌కు రు. 24 నుంచి రూ. 30 వరకు వస్తోంది.

> గుర్రంకొండ మార్కెట్ యార్డుకు 60 టన్నుల టమాటా వస్తే.. 12 టన్నుల వరకు దళారులు దోచుకుంటున్నారు. వీటిని 25 క్రేట్ల రూపంలోకి మార్చితే 480 క్రేట్లు అవుతాయి. మార్కెట్లో 25 కిలోల క్రేట్ ధర అత్యధికంగా రూ.1000 పలుకుతోంది. ఈ మేరకు రూ.4.80 లక్షలు నిత్యం దోచుకొంటున్నారు.

### దళారులు.. పాడిందే పాట

మార్కెట్ యార్డులో దళారులు పాడిందే పాటగా మారింది. బయట ప్రాంతాల్లో ధర ఎలా ఉన్నా ఇక్కడి వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి ఒకే ధర నిర్ణయించేస్తున్నారు. అన్ని మండీల్లోనూ అవే ధరలతో వేలం పాడుతుండడంతో రైతులు దారుణంగా నష్టపోతున్నారు. జాక్ పాట్‌పై గానీ, పది శాతం కమిషన్లపై ప్రశ్నించే రైతులపై దళారులు కక్ష కడుతున్నారు. రైతులు తెచ్చిన టమాటాలను మార్కెట్ ధర కంటే 50శాతం తక్కువకే వేలం పాడి వేధిస్తున్నారు. పాడిన డబ్బుల కోసం రోజుల తరబడి తిప్పుకొంటూ నానా కష్టాలకు గురిచేస్తున్నారు.

### వేలంపాట ధరలోనూ కోత

మార్కెట్ యార్డులో మండీల్లో వేలం పాట పాడిన ధరల్లో మళ్లీ కోత విధిస్తున్నారు. రూ.1000 క్రేట్ ధర పలుకుతుంటే వేలం పాటలో అవే ధరలు పాడి మళ్లీ రసీదుల్లో లెక్క కట్టే సమయంలో రు. 50 నుంచి రూ.100 వరకు కోత విధిస్తున్నారు. అందరిముందర ఒక ధర పాడుకొని బిల్లుల్లో మాత్రం కోత విధిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఓవైపు జాక్ పాట్, మరో వైపు పది శాతం కమీషన్లు, మళ్లీ వేలంపాట ధరల్లో కోతలు దీంతో రైతు అన్ని విధాలా నష్టపోతున్నారు.

### జాక్‌పాట్‌తో తీరని నష్టం



రైతులు జాక్‌పాట్‌తో నష్టపోతున్నారు. మొదట పది క్రేట్‌లకు ఒక క్రేట్ జాక్‌పాట్‌గా తీసుకొంటున్నారు. తరువాత క్రేట్లపై పదికి ఒకటి చొప్పున ఎత్తుగా పోస్తున్నారు. జాక్‌పాట్ పెట్టకపోతే వేలంపాటల్లో ధరలు మరోలా ఉంటున్నాయి. గతంలోనూ రైతులు ఆందోళన చేస్తే కొనుగోలు చేయకుండా వేధించారు.

– గయాజ్ అహ్మద్, గుర్రంకొండ, గుర్రంకొండ మండలం

### పది శాతం కమీషన్ వసూలు



టమాటా ఉండీల్లో వేలం పాట పాడుకొన్న మొత్తం డబ్బులో పది శాతం డబ్బులు కమీషన్ల కింద తీసుకొంటున్నారు. నాలుగు శాతం మాత్రమే తీసుకుంటామని బోర్డులు పెట్టి అదనంగా ఆరు శాతం వసూలు చేస్తున్నారు. వేలంపాటలో పాడుకొన్న ధర కంటే తగ్గించి లెక్కగట్టి బిల్లులు ఇస్తున్నారు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

– రామకృష్ణారెడ్డి, దౌలత్‌ఖాన్‌పల్లె

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గుర్రంకొండ యార్డులో జాక్‌పాట్ పేరుతో రైతులను దోచుకొంటున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. సమస్య పరిష్కరిస్తాం.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

## 7న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జూన్ 7న ఉదయం 10.30 గంటలకు స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని సీఈఓ సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## వైభవంగా అంజన్న తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న పురోహితులు

చక్రాయపేట : హనుమజ్జయంతి కార్యక్రమాల్లో భాగంగా గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో రెండో రోజున అంజన్న తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వార తోరణం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, తిరు మంజనం, లఘు పూర్ణాహుతి గోష్ఠి నిర్వహించినట్లు అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. ఆలయ అధికారి అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ, బిందుసాగర్, రామ్మోహన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 1న రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు అభయాంజనేయస్వామి తిరునాల సందర్భంగా జూన్ ఒకటో తేదీన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ రాజ నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆంజనేయ స్వామికి జలు చేసి అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీల్లో వరుస విజేతలకు రూ.1 లక్ష, రూ.70వేలు, రూ.40వేలు, రూ.20వేలు బహుమతిగా అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు రూ.800 చెల్లించి రసీదు పొందాలన్నారు. పూర్తి వివరాలకు 9490792999, 9441932390లో సంప్రదించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడిన మణికి సపర్యలు చేస్తున్న స్థానికులు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలోని పందిళ్లపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు..ఆర్‌టీపీపీకి చెందిన తులసీరాం, మణిలు కడపకు బైక్‌లో వెళ్తున్నారు. మార్గమధ్యంలో పందిళ్లపల్లె వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. భార్య, భర్తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

## కొరడవేల అలంకారంలో చెన్నకేశవుడు



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్ శ్రీమహాలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామున చెన్నకేశవస్వామి, మహాలక్ష్మీదేవిల మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కొరడవేలగా అలంకరించి అశ్వవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కాయాకర్పూరాలను సమర్పించి పూజించారు. శుక్రవారం డోపు ఉత్సవం నిర్వహించనున్నారు.

# బంగారు 'భవిత'కు బాటలు

- ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి చర్యలు
- సమగ్రశిక్ష ద్వారా సంక్షేమ పథకాల వర్తింపు



యర్రగుంట్ల భవిత కేంద్రంలో పిల్లలకు వీల్ చైర్లు అందిస్తున్న అధికారులు

ఎర్రగుంట్ల : ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిని బడి బాట పట్టించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. జిల్లా వ్యాప్తంగా వేసవి సెలవులు ప్రారంభమైనప్పటి నుంచి ఐఈఆర్పీలు సర్వే చేసి ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నారు. ఒక ఎర్రగుంట్ల మండలంలోనే 181 మందిని గుర్తించారు. పిల్లలను బడులకు పంపేందుకు ఆసక్తి చూపని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పేలా చర్యలు చేపడుతున్నారు.

### ప్రత్యేక వసతులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల భత్యం అందిస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధి మాంద్యం పిల్లలు, ఇంటివద్దే ఉంటున్న బాలికలకు సాయం అందిస్తోంది. పిల్లలకు రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ.200, పది నెలలకోసారి రూ.2వేలు ఇస్తోంది. ఎస్కార్ట్ అలవెన్స్ కింద నెలకు రూ.300 చొప్పున పది నెలలకు రూ.3 వేలు ప్రభుత్వమే సమకూరుస్తోంది. బాలికలకు గర్ల్ చైల్డ్ అలవెన్స్ కింద నెలకు రూ.200 ప్రకారం పది నెలలకు రూ.2 వేలు, హోమ్ అలవెన్స్ కింద నెలకు రూ.300 ప్రకారం పది నెలలకు రూ.3వేలు ఇస్తున్నారు. వీటితోపాటు బడికి వెళ్లే వారికి దుస్తులు, పాఠ్య పుస్తకాలు, దివ్యాంగ చిన్నారులకు ట్యాబ్‌లు ఉచితంగా అందజేస్తున్నారు.

### ప్రతి గ్రామంలోనూ సర్వే కొనసాగిస్తాం



జిల్లాలోని ప్రతి మండలంలోనూ 0–18 ఏళ్ల లోపు ప్రత్యేక పిల్లలను గుర్తించేందుకు సర్వే ముమ్మరంగా సాగుతోంది. ప్రతి గ్రామాన్ని జల్లెడ పడుతున్నాం. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులను కలిసి ఎన్‌రోల్ కాని పిల్లలను సమీప పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం.

– బి రవికుమార్, ఐఈఆర్పీ

## డ్రైవింగ్ లైసెన్స్ ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దు





మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ.బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహన చట్ట సవరణ పేరిట డ్రైవింగ్ లైసెన్సుల మంజూరు బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం తగదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా విజ్ఞప్తి చేశారు. నగరంలోని హోచిమన్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ నామమాత్రం ఫీజు రూ. 2వేల నుంచి రూ. 3వేలు ఉందని, ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే రూ.20 నుంచి రూ. 25 వేల వరకు డిమాండ్ చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుము డీలర్లకు ఇవ్వడంతో ఇప్పటికే రుసుము అమాంతంగా పెరిగిందన్నారు. నో పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్‌కు పోలీసులు విధించిన చలానా డబ్బులు.. నేటికీ ప్రైవేటు యాప్ ద్వారా పక్కదారి పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లింగన్న, వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు

# అరటి మొక్కలు ధ్వంసం



రామసుబ్బమ్మ పొలంలో ధ్వంసమైన అరటి మొక్కలు

లింగాల : ఏపుగా పెరిగిన అరటి మొక్కలను గురువారం కొందరు ధ్వంసం చేశారు. స్థానికుల వివరాల మేరకు... మండలంలోని పార్నపల్లె గ్రామానికి చెందిన బోనాసి రామ సుబ్బమ్మ, బోనాసి సరస్వతమ్మ మధ్య కొద్దిరోజులుగా భూమి సమస్య ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా పోలీస్ స్టేషన్, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. నాలుగేళ్ల కిందట పంచాయితీ పరిష్కారం జరిగింది. సరస్వతమ్మ, రామసుబ్బమ్మకు చెందిన భూమి తనకు కావాలంటూ కుమార్తె కుమారి, అల్లుడు శ్రీనివాసులు, బోనాసి రామసుబ్బమ్మ కుమారుడు బాబుపై ఒత్తిడి తెచ్చారు. బుధవారం రాత్రి సరస్వతమ్మ అల్లుడు శ్రీనివాసులు డోజర్లతో రామసుబ్బమ్మ పొలంలో నాటి అరటి మొక్కలు ధ్వంసం చేశారు. ఈ విషయమై యల్లనూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని రామసుబ్బమ్మ తెలిపారు.

# కీచక ఉపాధ్యాయుడు అరెస్టు

- ప్రేమ పేరుతో 13 ఏళ్ల బాలికకు వంచన
- పెళ్లి చేసుకోమంటే భార్య, పిల్లలున్నారని నిరాకరణ



అరెస్టయిన ఆంజనేయులు

బి.కొత్తకోట : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు పరచాల్సిన ఉపాధ్యాయుడే.. కీచకుడిగా మారాడు. 13 ఏళ్ల విద్యార్థిని మాయ చేసి అత్యాచారానికి ఒడిగట్టాడు. పెళ్లిచేసుకోమంటే.. తనకు భార్య, పిల్లలున్నారంటూ చెప్పి తప్పుకున్నాడు. చివరికి బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కీచక ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సూర్యనారాయణ వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పెద్దతిప్పసముద్రం మండలం మల్లెలకు చెందిన జి.ఆంజనేయులు (33) గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాలలో చదువుతూ చురుగ్గా మాట్లాడే ఓ 13 ఏళ్ల బాలికపై కన్నేశాడు. ప్రేమ, పెళ్లి అంటూ మాటలు చెప్పి మొబైల్‌లో మాట్లాడుతూ, మెసేజ్ పంపుతూ మాయ చేశాడు. ఈ నెల 4న బి.కొత్తకోటకు వచ్చిన అంజి.. బాలికకు ఫోన్‌చేసి నువ్వు రాకుంటే ఏమైనా తీసుకుని చనిపోతానంటూ బెదిరించాడు. దీంతో బాలిక ఇంటినుంచి రాగా..బెంగళూరులో ఉంటున్న బంధువు ఇంటికి తీసుకెళ్లి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక అదృశ్యం కావడంతో తల్లి పోలీసులను ఫిర్యాదు చేశారు. కేసు నమోదు విషయం తెలుసుకున్న బాలిక తనను పెళ్లి చేసుకోవాలని అంజనేయులుపై ఒత్తిడి చేసింది. తనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారని చెప్పి నిరాకరించాడు. తర్వాత ఇంటికి చేరుకున్న బాలిక విషయాన్ని తల్లికి చెప్పడంతో పోలీసులు ఫిర్యాదు చేశారు. అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి బి.కొత్తకోట సమీపంలోని మల్లెల క్రాస్‌లో అంజనేయులును అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

## రాజంపేట సబ్‌జైల్ పరిశీలన

రాజంపేట : రాజంపేట సబ్ జైల్‌ను కడప న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది గురువారం పరిశీలించారు. జైలులో ఖైదీలను విచారించి, పరిసరాలు తనిఖీ చేశారు. వసతిగదులు, వంటగది, మరుగుదొడ్లు చూసి ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు.

## దుకాణంలో అగ్నిప్రమాదం

మదనపల్లె : పట్టణంలోని సంతగేట్ సమీపంలోని చంద్ర విలాస్ వద్ద నవాజ్ స్టవ్ దుకాణంలో గురువారం మధ్యాహ్నం ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం జరిగింది. యజమాని నవాజ్ అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా, సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారుగా రూ.10 వేల నష్టం వాటిల్లినట్లు నవాజ్ తెలిపారు.

## ఇంటి సామగ్రి ధ్వంసం

బి.కొత్తకోట : మండలంలోని దిన్నిమీదపల్లెకు చెందిన విశ్వనాథ్‌పై కొందరు దాడిచేసి ఇంట్లోని సామాగ్రిని ధ్వంసం చేశారు. ఏఎస్‌ఐ బొజ్జి నాయక్ వివరాల మేరకు.. ఘర్షణ జరగడంతో కోటావూరు పంచాయతీ చౌటకుంటపల్లెకు చెందిన పి.శేఖర్, అతని కుమారుడు వినోద్ మరింత మంది దిన్నిమీదపల్లెకు చెందిన విశ్వనాథ్‌ను కొట్టారు. తర్వాత ఫ్రిడ్జ్, ఇతర సామగ్రి ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

## ప్రాచీన భాషల సమ్మేళనానికి ఆహ్వానం



మునికుమార్

కడప కల్చరల్: భారతీయ ప్రాచీన భాషల మహా సమ్మేళనానికి కడపకు చెందిన నాగదాసరి ముని కుమార్‌కు ఆహ్వానం అందింది. జూన్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మైసూరులో జరిగే సమ్మేళనంలో తొలి రోజున ×తెలుగు రాత ప్రతులు, అధ్యయనశాస్త్రం–పరిచయం₹ అంశంపై ఆయన పత్ర సమర్పణ చేసి ప్రసంగించనున్నారు. కడప నగరానికి చెందిన మునికుమార్ కొన్నేళ్లుగా తాళపత్రాలు, ప్రాచీన తెలుగు గ్రంథాలపై పరిశోధనలు చేస్తున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ క్లాసికల్ లాంగ్వేంజెస్ సంస్థ నుంచి ఈ మేరకు ఆయనకు ఈ ఆహ్వానం అందింది.

## బాలిక అదృశ్యం



వర్షిణి(ఫైల్)

కడప అర్బన్: కడప నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముంటున్న పి.వర్షిణి(12) ఈ నెల 27 తేదీ నుంచి కనిపించడం లేదని తల్లి మాధవి గురువారం ఫిర్యాదు చేశారు. గాంధీ నగర్‌లో చదువుతున్న వర్షిణి వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంది. గురువారం ఇంటినుంచి వెళ్లిపోయిందని, ఆచూకీ వెతికినా లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ రంగస్వామి తెలిపారు.

## గుట్ట భూమి ఆక్రమణ

బి.కొత్తకోట : స్థానిక బీరంగి రోడ్డులోని పెయింటర్స్ కాలనీ, ఆదర్శ విద్యాలయం మధ్య గుట్టను ఆక్రమించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి చదును చేశారు. ఖరీదైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా.. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఆక్రమణ దారులకు పట్టాలున్నాయా? రికార్డుల్లో వారి పేర్లు ఉన్నాయా? పరిశీలించడం లేదు.

## సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. నక్కలదిన్నె తాండాకు చెందిన మునిస్వామి నాయక్ (23) స్థానికంగా సారా విక్రయిస్తుండడంతో అతని వద్ద నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.